క్లుప్తంగా

ఘనంగా ముత్యాలమ్మ పండగ



అమ్మవారి ఊరేగింపులో భక్తులు

రావికమతం: దొండపూడి గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి అమ్మవారి ఆలయానికి భక్తులు భారీగా తరలివెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి గుడిగా పూజించే వేప చెట్టుకు వందలాది మంది మహిళలు పసుపు, కుంకుమలు సమర్పించి పూజలు చేశారు. అమ్మవారి ఘటాలను మేళతాళాలు, నేల వేషాలతో గుడి వరకు ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

నేటి నుంచి ఏఐఎస్ఎఫ్ హాస్టళ్ల సందర్శన



సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి ఫణీంద్ర కుమార్

నర్సీపట్నం : ఈ నెల 21 నుంచి 31 వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టళ్ల సందర్శన కార్యక్రమాన్ని చేపడుతున్నామని జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహాలు సమస్యలతో స్వాగతం పలుకుతున్నా యన్నారు. సరైన సౌకర్యాలు లేవని, పలు చోట్ల సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మహిళా హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. యూనివర్శిటీని కూడా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. హాస్టళ్ల సందర్శనలో గుర్తించిన అంశాలను అధికారులకు నివేదిస్తామన్నారు. సమావేశంలో జగదీష్, సింహాద్రి, ప్రసాద్, సింహాద్రి, జస్వంత్, ధర్మ, పండు పాల్గొన్నారు.

హిందూమత వ్యాప్తికి నడుంబిగించాలి



ఆలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రామకొండలరావు

మాడుగుల రూరల్ : హిందూ మత వ్యాప్తికి ప్రతి హిందువు నడుం కట్టాలని, విశ్వ హిందూ పరిషత్ ఉత్తరాంధ్ర ప్రముఖ్ పాపయ్యశాస్త్రి అన్నారు. కె.జె.పురం కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లా విశ్వ హిందూ పరిషత్ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా విశ్వ హిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు రాపేట రామకొండలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉత్తరాంధ్ర దుర్గా వాహిని మేడం శోభారాణి, జిల్లా కార్యదర్శి సాయిప్రదీప్‌శర్మ, జిల్లా ప్రభారీ శ్రీకాళహస్తి, మండల ప్రఖండ అధ్యక్షుడు కరణం దేముళ్లు, కార్యదర్శి వెంకటప్పారావు, ఉపాధ్యక్షుడు అప్పాన ప్రసాదు మండలంలో గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

దేవరాపల్లి : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన సోమవారం నిర్వహించనున్నట్టు స్థానిక ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు తెలిపారు. మండల పరిషత్ సమావేశం మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు సర్వ సభ్య సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఈ సమావేశానికి హాజరవుతారన్నారు. మండల స్థాయి అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

ఘనంగా మోదకొండమ్మ ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న వైస్ ఎంపీపీ జ్యోతి, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు

కశింకోట: స్థానిక శారదానది అవతల పాలాల్లో మోదకొండమ్మ ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటాలు, తోడపెద్దు సేవలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పెంటకోట శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ జ్యోతి దంపతులు, రైతులు, ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. చీరలు, రవికెలు, అరటి గెలల రూపంలో అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు.

వెంటాడుతున్న వర్షాభావం

ఖరీఫ్ వరిసాగు ఆరంభంలోనే సాగు కష్టాలు మొదలయ్యాయి. రుతుపవనాలు ముందే ప్రవేశించడంతో రైతులు ముందుగానే దుక్కులు చేసుకొని వరి ఆకుమడులు సిద్ధం చేసుకున్నారు. గత నెలలో అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు రైతులు దక్కులు వేసుకుని విత్తనాలు జల్లుకున్నారు. అయితే అంతలోనే వాతావరణం మారిపోయింది. ఎండలు మండిపోయాయి. వర్షాభావం వెంటాడుతోంది. ఆకుమడులు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు..



సిద్ధం చేసుకున్న ఆకుమడుల్లో వరి విత్తనాలు చల్లుకుంటున్న రైతులు (ఫైల్)

ఆందోళనలో రైతులు

ఎండిపోతున్న ఆకుమడులు

మరోవైపు అందని పెట్టుబడి సాయం

రోలుగుంట : ప్రభుత్వం మండలంలో 740 క్వింటాళ్లను రాయితీపై పంపిణీ చేసింది. దీంతో రైతులు మెరక పొలంలో సాధారణ పద్ధతిలో విత్తనాలే చల్లుకోగా, బురదగా ఉన్న భూముల్లో విత్తనాలు చల్లి గొప్పులు తవ్వి పూర్తి చేసుకున్నారు. వరి ఆకు పోతల పనుల్లో బురదమయంగా ఉన్న ఆకుమడులు ఆకుపోత పనులు పూర్తయిన వారంలోనే మండిపోతున్న ఎండలతో ఎండిపోయి రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. విత్తనాలు చుల్లుకున్న రెండవ రోజునుంచే వరుణుడు ముఖం చాటేశాడు. ఆకుముడులు ఎండిపోయి తడులు చాలక విత్తనాలు ఆశాజనకంగా మొలకెత్తక రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలే వర్షాధార మండలం..ఆకుపోత పనులు పర్తయ్యాక ఎండలు దంచేస్తున్నాయి. ప్రభుత్వ రాయితీపై సాగుకు ఒక దఫానే విత్తనాలు పంపిణీ చేస్తారు. తరువాత



చెరువుల కింద సాగునీటి కోసం పంట కాలువలు ఏర్పాటు చేసుకున్న రైతులు

వర్షాలు పడినా విత్తనాలుండవు. ప్రకృతి కన్నెర్ర చేయడం ఒక సమస్య కాగా, కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు సంక్షేమ చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. గత ప్రభుత్వం (వైఎస్సార్‌సీపీ) హయాంలో ప్రతి ఏటా రూ.13,500 రైతు భరోసా పథకం కింద పంట పెట్టుబడి సాయం అందేది. కుటమి ప్రభుత్వం ఏర్పడి అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు పెట్టుబడి సాయమందిస్తామన్నారు. పథకం పేరు మార్చారు, పెట్టుబడి సాయం పెంచుతామన్నారు. పైసాకూడా ఇవ్వలేదు. దీంతో వాతావరణం అనుకూలించక, రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రాక, అన్నదాత పరిస్థితి ఆందోళనకరంగా మారింది. వాతావరణం కలిసిరావాలని, అన్నదాతను ఆదుకోవాడానికి ప్రభుత్వం మనస్సు మారాలని రైతులు పూజలు చేసుకుంటున్నారు.

ఆకు మొలకెత్తలేదు..

ప్రభుత్వం రాయితీపై ఇచ్చిన విత్తనాలు ఆకుమడిలో చల్లుకున్నాను. నాలుగు రోజలుగా ఎండలు మండిపోతున్నాయి. తడులు ఆరిపోయి ఆకు ఇప్పటికీ మొలకెత్తలేదు, ఆందోళనగా ఉంది.

– బంటు రాములమ్మ, రైతు, కొండపాలెం

ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం లేదు

ఎండలు దంచేస్తున్నాయి. ఇప్పటి వరకూ అప్పులు చేసి దుక్కులు చేసుకొని, వరి విత్తనాలు తెచ్చుకున్నాను. ఆకుపోత పనులు పూర్తయ్యాయి. ఇటుపైన పెట్టుబడుల కోసం అప్పు చేయాల్సిందే. గత ప్రభుత్వంలో పంట పెట్టుబడి సాయం ఏడాదికి రూ.13,500 అందేది. కూటమి ప్రభుత్వం వచ్చింది పైసా కూడా అందలేదు.

– బి.లక్ష్మి, రైతు, రోలుగుంట

అప్పు చేసి సాగు చేస్తున్నా..

రెండెకరాల విస్తీర్ణంలో వరిపంట సాగు చేసుకోవాలి. ఇప్పటి వరకూ అప్పులు చేశాను. చేతిలో రూపాయి లేదు. గత ప్రభుత్వంలో ఏడాదికి ఏడాదికి రూ.13,500 పంట పెట్టుబడి సాయం అందేది. ఎన్నికల ముందు రూ.20 వేలు సాయమందిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారంలోకి ఏడాది దాటినా రూపాయి కూడా అందలేదు. పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

– కె.రాము, రైతు, కొండపాలెం

10 రోజుల వరకూ తేమ ఉంటుంది

ఆకుపోత వేసుకున్న రైతుల్లో ఆందోళన వద్దు. భూమిలో తేమ పది రోజుల వరకూ ఉంటుంది. విత్తనాలు మొలకెత్తుతాయి. అన్నదాత సుఖీభవ పథకం అర్హులకు త్వరలోనే అందుతుంది. జాబితాలు తయారయ్యాయి. కార్యాలయం వద్ద జాబితా రైతులకు అందుబాటులో ఉంచుతాం.

– చిరంజీవి,
మండల వ్యవసాయాధికారి, రోలుగుంట

నీటి ఇంజిన్లకు డిమాండ్



కొమరవోలు ఆవ నుంచి ఇంజిన్ సాయంతో నీటిని సేకరించుకుంటున్న రైతులు

రోలుగుంట : మండల రైతాంగం ఖరీఫ్ వరి సాగులో భాగంగా వారి నారుమడుల్లో ప్రభుత్వం రాయితీతో ఇచ్చిన వివిధ రకాల వరి విత్తనాలతో ఆకుపోత పనులు పూర్తి చేసుకున్నారు. ప్రారంభంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నారు మడులు పచ్చగానే ఉన్నాయి. వారం రోజులు నుంచి ఎండ ప్రభావం ఎక్కువగా ఉండంటంతో నారు మడులు ఎండుపోతున్నాయి. దీంతో రైతులు సమీప చెరువుల నుంచి బిందెలు, బకెట్లతో తడుపుతున్నారు. చెరువులు దూరంగా ఉంటే ఇంజిన్లతో నారుమడులు తడుపుతున్నారు. ఇదే అదనుగా ఇంజిను యజమానులు నారుమడికి రూ.300 తీసుకుంటున్నారు. అన్ని గ్రామాల్లో ఒకేసారి ఈ పనులు ప్రారంభం కావడంతో తమ గ్రామాల్లో ఇంజిన్లు లేకుండా పొరుగు గ్రామాలకు వెళ్లి ఇంజిన్లు తెచ్చుకొని నారుమడులు తడుపుతున్నారు. స్థానిక నది చెరువు, కొత్త చెరువు కింద ఆకు మడులను ముద్దు దాగ్రాజు, అప్పలనాయుడు వారంలో 120 మంది రైతుల నారుముడులు తడిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది విత్తనాలు రేటు కూడా పెరగడంతో రైతులపై అధిక భారం పడడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు.

నదిలో వ్యర్థాలు వేస్తే చర్యలు



చేపల వ్యాపారులకు నోటీసులు అందిస్తున్న పంచాయతీ సిబ్బంది

బుచ్చెయ్యపేట : పెద్దేరు నదిలో చేపలు, కోళ్ల, మాంస వ్యర్థాలు వేస్తే తగిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. మేజర్ పంచాయితీ వడ్డాదిలో చేపలు, మాంస దుకాణాలు పెద్దేరు నదిని ఆనుకుని ఉన్నాయి. కొంతమంది వ్యాపారులు వాటి వ్యర్థాలను నదిలో వేయడం వల్ల నీటి కాలుష్యం పెరుగుతోంది. వ్యర్థాలు కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. పలువురు భక్తులు ఆలయాలకు వెళ్లే ముందు నదిలో పుణ్య స్నానాలు చేసి దేవుళ్లను దర్శించుకుంటారు. కలుషితమైన నీటిలో స్నానాలు చేసి దైవ సన్నిధిలో వెళ్లడం భక్తులకు ఇబ్బందిగా ఉంది. వడ్డాది పెద్దేరు నదిలోనే మంచినీటి బావి బోరు ఉండడంతో తాగునీరు కలుషితమై రోగాలు ప్రబలే ప్రమాదం కూడా ఉంది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఈవో లవరాజు పెద్దేరు నదిలో కుళ్లిన వ్యర్థాలు వేస్తే చర్యలు తీసుకుంటామని గ్రామంలో ఉన్న చేపలు, మాంసం అమ్మకాల వ్యాపారులకు తమ సిబ్బంది ద్వారా ఆదివారం నోటీసులు అందించారు.

భక్తి శ్రద్ధలతో సత్యసాయి, సత్యనారాయణ వ్రతాలు



దేవరాపల్లి సత్యసాయి ధ్యాన మందిరంలో సామూహిక వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

దేవరాపల్లి : దేవరాపల్లి సత్యసాయి ధ్యాన మందిరంలో భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలలో భాగంగా సత్యసాయి, సత్యనారాయణ సామూహిక వ్రతాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. మండల వ్యాప్తంగా 180 మంది భక్తులు వ్రతాల్లో పాల్గొన్నారు. విశాఖపట్నంకు చెందిన జిల్లా ఆధ్యాత్మిక మహిళా సమన్వయకర్త ఎస్.రాధ సామూహిక వ్రతాలను జరిపించారు. అనంతరం సత్యసాయి బాబా జీవిత చరిత్ర, లీలలు, పూజా విశిష్టతను ఆమె భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కొరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి సూచించిన ఆధ్యాత్మిక, సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని అన్నారు. జోన్ ఇంచార్జ్ సి.హెచ్.వి. రవిశంకర్, సత్యసాయి భక్తులు పెంటారావు, వెంకటపతి, జగన్నాథం, కన్నబాబు, రమణమూర్తి, రమామణి, మహిళా సేవాదళ్ సభ్యులు, బాల వికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలకు ఘన సత్కారం



మహిళా నేతలు వేచలపు వాణి, గొర్రుపోటు రమాదేవిలను సత్కరిస్తున్న స్థానిక నాయకులు

దేవరాపల్లి : వైఎస్సార్‌సీపీలో నూతనంగా నియమితులైన జిల్లా మహిళా విభాగం కార్యవర్గ సభ్యురాలు వేచలపు వాణి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవిలను దేవరాపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ మేరకు దేవరాపల్లిలో ఆదివారం వీరిని స్థానిక వైఎస్సార్‌సీపీ సత్కరించి అభినందించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరదపురెడ్డి లలితానాయుడు, ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ డా. వరదపురెడ్డి సింహాచలం నాయుడు తదితర నాయుకులు ఇద్దరు మహిళా నాయకులను సాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వాణి, రమాదేవి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో మహిళలకు అధిక ప్రాధాన్యం లభిస్తుందని, తమకు ఈ అవకాశం కల్పించిన మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వరదపురెడ్డి చంద్రరావు, నమ్మి నాగరాజు, కొరుప్రోలు శ్రీను, వదరపురెడ్డి అప్పలనాయుడు, గంగవంశం సంతోష్, పాశిల వెంకటరావు, బొడ్డు రజని, అల్లు జగదీశ్వని, గాలి అనురాధ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



కల్వర్ట్‌పై కుంగుతున్న రోడ్డు ప్రాంతం

కె.కోటపాడు : కృష్ణారాయుడుపేట–ఆర్.వై.అగ్రహారం గ్రామాల జంక్షన్ వద్ద రైవాడ కెనాల్‌పై నిర్మాణం జరిపిన కల్వర్ట్ బలహీనమైంది. ఇప్పటికే ఈ కల్వర్ట్ పైభాగంలో గల తారురోడ్డు సగ బాగం కిందికి కుంగింది. దీంతో తారురోడ్డులో ఓ పక్కగా బస్సులతో పాటు వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలను సాగిస్తున్నారు. అసలే ఈ కృష్ణారాయుడుపేట– ఆర్.వై.అగ్రహారం కూడలి వద్ద గల కల్వర్ట్ పైనుంచే కొత్తవలస, విజయనగరం, దేవరాపల్లి, వేపాడ మండలాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. బలహీనమైన కల్వర్ట్ మరింతగా కుంగితే ఈ దారిలో బస్సులు, ద్విచక్రవాహనాలు, ఆటోల రాకపోకలు నిలిచిపోనున్నాయి. ఈ ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రత్యామ్నాయ మార్గాలు లేనందున కుంగుతున్న కల్వర్ట్‌కు యుద్ధ ప్రాతిపాదికన మరమ్మతులు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్సులను ఈ కుంగిన కల్వర్ట్ వంతెన పైనుంచి నడిపేందుకు డ్రైవర్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఆదిరెడ్డి చిన కన్నబాబు

దేవరాపల్లి : అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి ఆదుకోవాలని పెన్షనర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు చిన కన్నబాబు కోరారు. ఈ మేరకు దేవరాపల్లిలో మండల పెన్షనర్ల (రిటైర్డ్ ఉద్యోగులు) అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు చినకన్నబాబు మాట్లాడుతూ తమకు పెండింగ్‌లో ఉన్న డీఆర్ (కరువు భత్యం) చెల్లించాలని, పీఆర్‌సీ, ఫిట్‌మెంట్ ప్రకటంచాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు డీఆర్, పీఆర్‌సీ లేకుండా చేయాలన్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. అనంతరం దేవరాపల్లిలో నూతనంగా నిర్మించిన భగవాన్ సత్యసాయి ధ్యాన మందిరానికి పెన్షనర్ల అసోసియేషన్ తరపున రూ.10 వేల నగదును స్థానిక మందిర కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ మండల కార్యదర్శి పోతల చిన అప్పలనాయుడు, ట్రెజరర్ గాలి అబద్ధం, గౌరవ అధ్యక్షుడు చలుమూరి అప్పలనాయుడు, పూర్వ కార్యవర్ది ఆదిరెడ్డి చిన్నంనాయుడు పాల్గొన్నారు.

ఆకుకూరలతో మెరుగైన కంటి చూపు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న దంతులూరి దిలీప్‌కుమార్

తుమ్మపాల: మెరుగైన కంటి చూపు కోసం ఆకుకూరలతోపాటు సరైన నిద్ర అవసరమని డాక్టర్ అరుణ తెలిపారు. చూపు మందగిస్తున్న వృద్ధులకు ఉచితంగా ఆపరేషన్ చేసి కళ్లద్దాలు అందిస్తామన్నారు. మండలంలోని తుమ్మపాలలో పోలిపల్లెమ్మ ఆలయం వద్ద వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ ప్రారంభించారు. గ్రామంలో కంటి చూపుతో బాధపడుతున్న అనేక మంది వృద్ధులు వైద్య పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 50 మందికి పైగా కంటి సమస్యలు ఉన్నవారిని విశాఖలోని శంకర్ ఫౌండేషన్‌కు ఉచితంగా తీసుకెళ్లి ఆపరేషన్ చేస్తామని డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్, వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎరుబండి సత్యనారాయణ, మహేష్, బాబూరావు, బొడ్డపాటి చినరాజారావు, సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం



చౌడువాడలో కురుస్తున్న వర్షం

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుండి ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడ్డ ప్రజలు కురిసిన వర్షంతో సేదతీరారు. ఏకధాటిగా రెండు గంటల పాటు కురిసిన వర్షంతో చౌడువాడ, గొండుపాలెం, గుల్లేపల్లి తదితర గ్రామాల్లో గల సాగునీటి చెరువుల్లోనికి వర్షపునీరు చేరుకుంది. పల్లపు ప్రాంత గ్రామాలైన మల్లంపాలెం, పాచిలవానిపాలెం, పైడంపేట, రొంగలినాయుడుపాలెం గ్రామాల్లో వరినాట్లు వేసేందుకు పొలాలకు దమ్ములు పట్టేందుకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

చీడికాడ: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం కురిసిన మోస్తరు వర్షం వరినారుకు ఊపిరి పోసింది. గడిచిన వారం రోజులుగా తీవ్రంగా కాస్తున్న ఎండలతో వరినారు వడలిపోయి ఎండిపోయే దశకు చేరుకుంది. ఈ స్థితిలో అవకాశం ఉన్న రైతులు డీజిల్ మోటార్లతో నీటి తడులిచ్చారు. ఈ నేపథ్యంలో కురిసిన వర్షం వరి నారుకు ఊపిరి పోసి రైతులకు ఊరటనిచ్చింది.

మాడుగుల రూరల్: ఎండ తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలు, ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. పది రోజులుగా కాస్తున్న ఎండ తీవ్రతతో రైతులు వేసిన ఖరీఫ్ వరినారు ఎండిపోతున్న తరుణంలో కురిసిన వర్షం వల్ల కొంత మేర ఉపశమనం ఏర్పడింది. ఈ వర్షం వరినారు మడులుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు పేర్కొన్నారు.

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు



మూల విరాట్‌కు పంచామృత అభిషేకాలు చేస్తున్న ఆలయ అర్చకులు

అనకాపల్లి: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గవరపాలెం సంతోషిమాత దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, ఆలయ చైర్మన్ మారిశెట్టి భాస్కర్‌రావు దంపతులు ఆదివారం ఇక్కడ అమ్మవారి మూలవిరాట్‌కు పాలు, పంచదార, తేనె పసుపు కుంకుమలతో అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, ప్రధాన అర్చకుడు కామేశ్వర రావుశర్మ, ధర్మకర్తలు ఆళ్ల రవికుమార్, బుద్ధ ఈశ్వరరావు, పొలిమేర సన్యాసినాయుడు, పీలా రాజేష్, కర్రి మణి, తదితరులు పాల్గొన్నారు.

చికెన్‌తో పోటీపడుతున్న ఆగాకరకాయ

● చికెన్ కేజీ రూ.172.. ఆగాకర రూ.160



అనకాపల్లి టౌన్: కాలానుగుణంగా లభించే కాయగూరలలో ఆగాకరకాయ ఒక్కటి. దీనిలో పోషకాలు ఎక్కువగా ఉండటంతో శాకాహార, మాంసాహార ప్రియులు ఎక్కువగా తినడానికి ఇష్టపడతారు. దీని ధర మాత్రం చికెన్‌తో పోటీ పడుతోంది. అనకాపల్లి మార్కెట్‌లో ఆదివారం స్కిన్ చికెన్ కేజీ రూ.172 ఉండగా, ఆకాకరకాయ రూ.160 పలికింది. ఏటా వర్షాకాలంలో నెల నెలన్నర రోజులు మాత్రమే ఇది మార్కెట్‌కు వస్తుంది. ఈ సీజన్‌లో ఒక్కసారైనా ఈ కాయగూరను తినాలని, దీనిలో మలబద్ధకం, ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుందని, రక్తప్రసరణ అదుపులో ఉంచుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఉత్సాహంగా లాంగ్ వాకింగ్ పోటీలు



లాంగ్ వాకింగ్ పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న అప్పారావు

అనకాపల్లి: ఆరోగ్యంగా జీవించాలంటే ప్రతి వ్యక్తి నిత్య వ్యాయామం చేయాలని బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ చైర్మన్ పి.ఎస్.అప్పారావు తెలిపారు. ఆగస్టు 3న అంతర్జాతీయ స్నేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రింగ్‌రోడ్డులో లాంగ్ వాకింగ్ పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా తర్వాత మానవ జీవనశైలిలో అనేక మార్పులు సంభవించాయన్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వివిధ రకాల వ్యాధులు బారినపడుతున్నట్లు పేర్కొన్నారు. నిత్య వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. అనంతరం లాంగ్ వాకింగ్ పోటీల్లో విజేతలకు డాక్టర్ డి.డి.నాయుడు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట నర్సింగరావు, అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె. జోగినాయుడు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి భర్మికాన శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారు ఏర్పాటు చేయాలని ధర్నా



డీసీఎంఎస్ ఆవరణ వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

అనకాపల్లి: స్థానిక గాంధీ కూరగాయలు మార్కెట్ సమీపంలో డీసీఎంఎస్ స్థలంలో రైతులు కూరగాయలు అమ్మకాలు సాగించేందుకు ప్రభుత్వం రైతు బజార్ ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరనాథ్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డీసీఎంఎస్ ఆవరణలో రైతులతో కలిసి అఖిల పక్ష నేతలు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పట్టణంలో రైతు బజారు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి 25 కిలోమీటర్లు నుంచి రైతులు తీసుకొచ్చే కూరగాయలు అమ్మకాలు సాగించేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హామీని తక్షణమే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, పార్టీ జిల్లా యువ నాయకుడు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.